
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 38.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

మంగళవారం 8 ఏప్రిల్ 2025

మట్టి దందా.. కనిపించలేదంట..!

కళ్ల ముందరే పెద్దపెద్ద టిప్పర్లు, ట్రాక్టర్లలో యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. ఎక్స్‌కవేటర్లను పెట్టి కొండలను కరిగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా మట్టి అక్రమ రవాణా తమ దృష్టికి రాలేదని అధికారులు బొంకుతున్నారు. అక్రమంగా తరలిస్తున్నట్లు ప్రజలెవరూ తమకు ఫిర్యాదు చేయలేదని బుకాయిస్తున్నారు. అధికారులు, చోటామోటా నాయకులు కుమ్మక్కై యథేచ్ఛగా కొండలను కరిగించి జేబులు నింపుకుంటున్నారు. ప్రజలు ఫిర్యాదు చేస్తే తప్ప అక్రమ రవాణా అధికారులకు కనిపించదా..?

ట్రాక్టర్లు, టిప్పర్లతో యథేచ్ఛగా రవాణా

పట్టించుకోని అధికారులు

మట్టి మాఫియాకు రాజకీయ అండ



మల్లాకాల్వ గుట్టల్లో టిప్పర్‌లోకి మట్టి లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

ధర్మవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మట్టి మాఫియా చెలరేగిపోతోంది. కొండగుట్టలను సైతం వదలడం లేదు. రోజూ వందల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తూ పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నా అడిగే దిక్కే కరువయ్యారు. కూటమి నాయకుల అండదండలు పుష్కలంగా ఉండడంతో మట్టి దోపిడీ మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతోంది. మట్టి మాఫియాను అధికారులు, సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో వారి దోపిడీకి అంతే లేకుండా పోతోంది. ధర్మవరం మండలం మల్లాకాల్వ సమీపంలోని కొండగుట్టల్లో, చిన్నూరు, బత్తలపల్లి సమీపంలోని దేవరకొండ కొండ, గొట్లూరు, రేగాటిపల్లి గ్రామాల సమీపంలో మట్టి మాఫియా విజృంభిస్తోంది. ఇక్కడ ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు, ట్రాక్టర్లు పెట్టి విచ్చలవిడిగా మట్టిని తరలిస్తున్నారు. మట్టి మాఫియా ధాటికి కొండలు, గుట్టలు కరిగిపోతున్నా పట్టించుకునే వారేలేరు. కొందరు అధికారులు మట్టిమాఫియాతో చేతులు కలిపి జేబులు నింపుకుంటున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. మట్టి తవ్వకాలకు కూటమి పార్టీల నాయకుల అండదండలు ఉన్నట్లు తెలుస్తోంది. చోటా మోటా నాయకులు సైతం అధికారులను బెదిరిస్తూ పబ్బం గడుపుతున్నట్టు తెలుస్తోంది. మట్టి తరలింపు వెనుక భారీగా లావాదేవీలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఒక్కో టిప్పర్ రూ.6వేల నుంచి రూ.8వేలు, ట్రాక్టర్ రూ.2వేల నుంచి రూ.3వేల దాకా ధర పలుకుతున్నట్టు తెలుస్తోంది. నెలకు రూ.లక్షల్లో ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నట్టు తెలుస్తోంది.



ట్రాక్టర్ ద్వారా మట్టిని తరలిస్తున్న దృశ్యం.

అధికారులతో కుమ్మక్కు

అనుమతి లేకుండా మట్టిని తరలిస్తుంటే వాటిని అడ్డుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులది. కూటమి నాయకులే కాంట్రాక్టర్ అవతారమెత్తడంతో వారి అవినీతికి అంతులేకుండా పోతుంది. అక్రమంగా మట్టిని తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అటు నాయకులకు, ఇటు అధికారులకు పర్సెంటేజీల రూపంలో జేబులు తడుపుతుండటంతో మిన్నకుండి పోతున్నారని తెలుస్తోంది.

అనుమతులు ఇవ్వలేదు

ధర్మవరం మండలంలో మట్టిని తోలుకోవడానికి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. మట్టిని తరలిస్తున్నట్లు ప్రజలు ఎవరూ మా దృష్టికి తీసుకురాలేదు. మా దృష్టికి వస్తే వదిలే ప్రసక్తేలేదు.

-నటరాజ్, తహసీల్దార్, ధర్మవరం



మట్టికోసం గుట్టలోకి వెళ్తున్న టిప్పర్

అర్జీలను శ్రద్ధగా పరిష్కరించాలి : కలెక్టర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టర్‌లోని సమావేశ భవనంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ప్రజల నుంచి 220 అర్జీలను స్వీకరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి వచ్చే ప్రజల సమస్యల పరిష్కా రంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈనెల 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండల ప్రత్యేకాధికారులు వారి పరిధిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉత్సవాలు నిర్వహించాలని ఆదేశించారు. హంద్రీనీవా, జాతీయ రహదారులు, రైల్వే భూసేకరణ అంశాలపై అధికారులు సమగ్ర నివేదికలు అందించాలన్నారు. వేసవి, ఎండల దృష్ట్యా వచ్చే వారం నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓ సువర్ణ, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, ల్యాండ్ సర్వే ఏడీ విజయశాంతిబాయి, ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్, డీసీహెచ్ఓ తిపేంద్రనాయక్, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి మోహన్‌రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ మల్లికార్జునయ్య, గ్రామ, సచివాలయ నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

లైంగిక వేధింపుల నిరోధానికి కమిటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మహిళలు పనిచేసే ప్రతిచోటా లైంగిక వేధింపుల అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా మహిళ, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, లైంగింక వేధింపుల నిరోధక చట్టం పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పనిచేసే ప్రదేశాల్లో మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. లైంగిక వేధింపుల నుంచి మహిళలను కమిటీ కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, ఆర్డీవో సువర్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఆదాయం పెరగడంతోపాటు ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు, ధాన్యం స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ విధానంలో రైతులకు పెట్టుబడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కరిస్తాం: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదులను చట్ట పరిధిలో ఉన్నవాటిని సత్వరమే పరిష్కరిస్తామని ఎస్పీ రత్న పేర్కొన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 65 అర్జీలు వచ్చాయి. వాటిని ఎస్పీ స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్ట పరిధిలో ఉన్న వాటికి సత్వరమే న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.


ఫిర్యాదిదారుతో మాట్లాడుతున్న ఎస్పీ



మద్దతు ధరతో రాగుల కొనుగోలు

పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మద్దతు ధరతో రాగులు కొనుగోలు చేస్తామని జేసీ అభిషేక్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రబీలో రాగి పంట సాగుచేసిన రైతుల నుంచి ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరా సంస్థ ద్వారా క్వింటా రూ.4,290లతో కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలోని ఆయా రైతు సేవా కేంద్రాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సహకారంతో రాగులు కొనుగోలు చేస్తామన్నారు. ఈసీజన్‌లో రాగి పంటను ఈక్రాప్‌లో నమోదు చేసుకుని పంటను అమ్మదలచుకున్న రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించాలని జేసీ తెలిపారు. గోనే సంచులు, లోడింగ్, రవాణాచార్జీలు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. దళారులకు రాగి పంటను అమ్మి నష్టపోకుండా రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం : ఎంపీ బీకే



మాట్లాడుతున్న ఎంపీ

బత్తలపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ బీకే పార్థసారధి తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రలో వైద్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. మొబైల్ మెడికేర్ మిషన్‌ను ఎంపీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య రథంలో నిపుణులైన వైద్యసిబ్బందితో మారుమూల గ్రామాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామన్నారు. ఆసియాలోనే తొలిసారిగా మొబైల్ మెడికేర్ మిషన్ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహేష్, నారాయణరెడ్డి,వీరనారప్ప, జక్కంపూటి నాగభూషణ, కోటిబాబు, భాస్కర్ పాల్గొన్నారు.

ఆరోగ్యం మెరుగే..!

జిల్లాలో తక్కువగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ స్క్రీనింగ్‌లో వెల్లడి

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధులపరంగా జిల్లా పరిస్థితి చాలా మెరుగ్గా ఉన్నట్లు తేలింది. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్క్రీనింగ్ పరీక్షల్లో ఈ విషయం నిర్ధారణ అయింది. సీఎం చంద్రబాబు సచివాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్షలో జిల్లా గణాంకాలను అధికారులు వివరించారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలో పోల్చుకుంటే.. శ్రీసత్యసాయి జిల్లాలో అతి తక్కువ దీర్ఘకాలిక రోగులు ఉన్నట్లు తేలింది. రాష్ట్రంలో 18 ఏళ్లకు పైబడిన 2.15 కోట్ల మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అత్యల్పంగా జిల్లాలో 49,323 మందికి హైపర్ టెన్షన్ ఉన్నట్లు తేలింది. డయాబెటిస్ 26,257 మందికి ఉన్నట్లు తేలింది. ఈ రెండూ 41,188 మందికి ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలో గుండె జబ్బు బాధితులు 7,375 మంది, క్యాన్సర్ 3,690 మంది, కాలేయ రోగులు 596 మంది, సీఓపీడీ 1,731 మంది, నరాల జబ్బులు 1922 మంది, కిడ్నీ రోగులు 4,626 మంది ఉన్నట్లు గుర్తించారు.

భూగర్భ డ్రైనేజీ కనెక్షన్లలో కక్కుర్తి..!

ప్రభుత్వ ఆదాయానికి గండి

సిబ్బంది చేతివాటం

నిద్రమత్తులో అధికారులు

గృహాలు ఎక్కువ.. కనెక్షన్లు తక్కువ



మున్సిపల్ కార్యాలయం

పుట్టపర్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): భూగర్భ డ్రైనేజీ కనెక్షన్లలో అటు వినియోగదారులు, ఇటు అధికారులు కక్కుర్తికి పాల్పడుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఉమ్మడి జిల్లాలోనే మొదటిసారి ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో భూగర్భ డ్రైనేజీని ఏర్పాటు చేశారు. దేశ విదేశీ భక్తులతో నిత్యం సందడిగా ఉండే పుట్టపర్తిలో శుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ 2000వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూగర్భ డ్రైనేజీని ఏర్పాటు చేశారు. ఇందులో పుట్టపర్తి, గోకులం, ఎనుములపల్లి కొంత ప్రాంతం, ప్రశాంతి గ్రామంలో భూగర్భ డ్రైనేజీని ఏర్పాటుచేశారు. అడ్డగోలుగా ఎవరికివారే కనెక్షన్ తీసుకుని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. పట్టణంలో వ్యక్తిగత గృహాలు, లాడ్జిలు, అపార్ట్‌మెంట్లు వేల సంఖ్యలో ఉన్నాయి. మొత్తం కనెక్షన్లు 5,853 మాత్రమే ఉన్నాయి. భూగర్భ డ్రైనేజీ తీసుకోవాలంటే ఇందుకు ప్రభుత్వానికి కొంత డబ్బు చెల్లించి తరువాత ప్రతిఏడాది పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు విరుద్ధంగా అక్రమ కనెక్షన్లు కొనసాగుతున్నాయి. దాదాపు 500కు పైగా అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వీటిలో రెసిడెన్షియల్ ప్లాట్లు వేల సంఖ్యలో ఉన్నాయి. ఒక అపార్ట్‌మెంట్‌లో అధికారికంగా రెండు లేదా మూడు కనెక్షన్లు తీసుకుని మిగిలిన వాటిని అక్రమంగా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. లాడ్జిలు, గృహాలు సైతం డ్రైనేజీలలో పైపులు కలుపుకుని పన్నులు చెల్లించకుండా ఎగ్గొతున్నట్టు తెలిసింది.

సిబ్బంది చేతివాటం

ఇంటి పక్కనే డ్రైనేజీ పైపు పోతోంది. మూరెడు పైపుతో కనెక్షన్ వస్తుందన్న ఆశతో వినియోగదారులు అనుమతులు లేకుండా సిబ్బందికి కొంత డబ్బు చేతిలోపెట్టి మురికి నీటిని భూగర్భ డ్రైనేజీలో కలుపుకుంటున్నట్టు విమర్శలు ఉన్నాయి. కొందరైతే రాత్రికిరాత్రే రోడ్డును తవ్వేసి భూగర్భ డ్రైనేజీలో కలుపుకుంటున్నట్టు తెలుస్తోంది. అధికారికంగా వేసుకోవాలంటే వేలకు వేలు ఖర్చు అవుతుందని, ఇవేవి లేకుండా సిబ్బందితో కుమ్మక్కై కనెక్షన్లు అక్రమంగా తీసుకుంటున్నారు. ఇదంతా తెలిసినా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

అక్రమ కనెక్షన్లను తొలగిస్తాం

మున్సిపాలిటీ పరిధిలో అక్రమ డ్రైనేజీ కనెక్షన్లు ఎవరు తీసుకున్నా ఉపేక్షించేదిలేదు. వాటిని వెంటనే తొలగిస్తాం. కనెక్షన్ కావాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

-ప్రహ్లాద, కమిషనర్

పని చేసినా పస్తేనా..?

ఉపాధి కూలీలకు బిల్లుల పెండింగ్

1.02 లక్షల మందికి రూ. 21.27 కోట్ల బకాయి



మండుటెండలో పని చేస్తున్న కూలీలు

మడకశిర, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): చేసిన పనులకు మూడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది వారాలకు పైబడి చేసిన పనులకు బిల్లులు రావాల్సి ఉంది. జిల్లాలో 2.27 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో కూలీలు 3.99 లక్షలదాకా ఉన్నారు. పది వారాలకుపైబడి ఉపాధి పనులు చేసిన కూలీలు 1.02లక్షల మందిదాకా ఉన్నారు. వారికి రూ. 21.27 కోట్లు దాకా బిల్లులు చెల్లించాల్సి ఉంది. కేవలం మడకశిర క్లస్టర్ పరిధిలోని కూలీలకే రూ.6 కోట్ల దాకా బిల్లులు రావాల్సి ఉంది. చేసిన పనులకు సకాలంలో బిల్లు అందకపోవడంతో పస్తులు ఉండే పరిస్థితి నెలకొందని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లక తప్పదని కూలీలు అంటున్నారు. గతంలో వారానికే బిల్లులు బ్యాంకు ఖతాలో జమ అయ్యేవని ప్రస్తుతం బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

వసతులు కల్పించాలి

పనుల చేసే ప్రాంతాల్లో నీడ, నీరు, మజ్జిగ వంటి సదుపాయాలు కల్పించాలని పలువురు కూలీలు కోరుతున్నారు. ఎండలు మండిపోతున్న ప్రస్తుత తరుణంలో నేల గట్టి పడటం వల్ల పనులు ముందుకు సాగడం లేదని పేర్కొంటున్నారు. రోజంతా పనిచేసిన క్యూబిక్ మీటరు మట్టిని తీయలేక పోతున్నామని కూలీలు చెబుతున్నారు. మడకశిర నియోజకవర్గంలో ఎలాంటి ఉపాధి అవకాశాలు లేకపోవడంతో చాలమంది కూలీలు ఉపాధిహామీ పథకంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో వ్యవసాయ పనులు కూడా అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. దీంతో కూలీలు పనుల కోసం వలస వెళ్లాల్సిన పరిస్థితి. ఉపాధి పథకం ద్వారా జీవనం సాగిద్దామంటే సకాలంలో బిల్లులు అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కష్టంగా ఉంది: శ్రీరంగప్ప, హెచ్‌టీ హళ్లి



ఉపాధి పనులు చేసి వారాలు గడిచినా బిల్లులు రావడం లేదు. కుటుంబ పోషణ కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఉగాది పండుగకు చేతిలో చిల్లిగవ్వలేక ఇబ్బంది పడ్డాం. గతంలో మాదిరి బిల్లులు చెల్లించాలి. పనులు చేసేచోట నీరు, మజ్జిగ వంటి సదుపాయాలు కల్పించాలి. కూలీలు ఎండకు సేదతీరేందుకు నీడ కల్పించాలి.

రూ. 21.27 కోట్లు చెల్లించాలి

ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన కూలీలకు పది వారాలకు సంబంధించి బిల్లులు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో 1.02 లక్షలమంది కూలీలకు 21.27 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ నిధులు విడుదల చేసిన వెంటనే కూలీల ఖాతాలకు బిల్లులు జమ చేస్తాం.

- విజయేంద్ర ప్రసాద్. పీడీ, డ్వామా

ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోండి

పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జోమాటో, అమేజాన్, ఫ్లిప్ కార్ట్, బ్లూడాట్, ఈకార్ట్ మొదలైన సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు తమ సభ్యత్వాన్ని ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ సూర్యనారాయణ సోమవారం ప్రకటనలో కోరారు. ఈపోర్టల్‌లో సభ్యత్వ నమోదుపై ఈనెల ఏడో తేదీ నుంచి 17వరకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కార్మిక శాఖ కార్యాలయాల్లో అవగాహన కల్పిస్తామన్నారు. సందేహాలుంటే 9100825189కు సంప్రదించాలన్నారు.

రైతు సేవాకేంద్రాల ద్వారా జొన్నల కొనుగోలు

జేసీ శివనారాయణశర్మ

అనంతపురం టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో రైతుసేవాకేంద్రాల ద్వారా జొన్నలు కొనుగోలు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ సోమవారం ప్రకటనలో తెలిపారు. రైతులు పండించిన జొన్నలను కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తారన్నారు. కనీస మద్దతు ధర క్వింటాల్‌కి హైబ్రిడ్ రకం రూ.3.371, మల్దండి రకం రూ.3421గా నిర్ణయించామన్నారు. రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకుని ఉండాలన్నారు. నాణ్యతాప్రమాణాలకు అనుగుణంగా రైతుల కల్లాలనుంచే కొనుగోలు చేస్తామన్నారు. గోనెసంచులు, రవాణాచార్జీలు, కూలీల ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ కోరారు.

15 వరకు కంది కొనుగోలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 15వతేదీ దాకా కంది కొనుగోలు చేస్తామని ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 25 నుంచి జిల్లా వ్యాప్తంగా 31 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి దాకా 7,900 మంది రైతుల నుంచి 10,600 మెట్రిక్ టన్నుల కందులు మద్దతు ధరతో కొనుగోలు చేశామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు ఉద్యాన రైతుల రాష్ట్ర సదస్సు

అనంతపురం విద్య, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉద్యాన రైతుల రాష్ట్ర సదస్సును నిర్వహించనున్నట్లు సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్, రైతు సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు కాటమయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి మల్లికార్జున విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో రైతులు ఎక్కువగా మామిడి, అరటి పండ్లతోటలతో పాటు పూలు, కూరగాయలు సాగుచేస్తున్నారని అన్నారు. ఉద్యాన పంటలకు అనువైనభూములు జిల్లాలో అందుబాటులో ఉన్నాయన్నారు. బోరుబావులు తవ్వించేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఉద్యాన రైతుల సదస్సును సీపీఐ శ్రేణులు, ఉద్యాన రైతులు, కూలీలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కొనసాగిన అంతర్ జిల్లా హాకీ టోర్నీ


తలపడుతున్న అనకాపల్లి, పశ్చిమ గోదావరి జట్లు

ధర్మవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న 15వ జూనియర్ అంతర్ జిల్లాల హాకీ టోర్నీ రెండో రోజైన సోమవారమూ హోరాహోరీగా సాగాయి. ప్రకాశం జట్టుపై 1-3 గోల్స్ తేడాతో అనంతపురం జట్టు విజయం సాధించింది. అలాగే ఏలూరు జిల్లా జట్టుపై ఏడు గోల్స్ తేడాతో విశాఖపట్నం జిల్లా జట్టు, ఎన్టీఆర్ జిల్లాపై ఏడు గోల్స్ తేడాతో కడప జిల్లా, గుంటూరుపై ఐదు గోల్స్ తేడాతో అన్నమయ్య, వెస్ట్‌గోదావరిపై ఆరు గోల్స్ తేడాతో అనకాపల్లి, ఏలూరుపై రెండు గోల్స్ తేడాతో శ్రీకాకుళం జట్టు, చిత్తూరుపై ఆరు గోల్స్ తేడాతో కాకినాడ, బాపట్లపై రెండు గోల్స్ తేడాతో సత్యసాయి, నంద్యాలపై ఐదు గోల్స్ తేడాతో అనంతపురం జిల్లా జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణుక్యరాజు, కోశాధికారి థామస్ పీటర్, సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి బంధనాథం సూర్యప్రకాశ్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌరీప్రసాద్, జిల్లా కోశాధికారి అంజన్న, జిల్లా జాయింట్ సెక్రటరీ అరవింద్‌గౌడ్, జిన్నేచందు, డైరెక్టర్లు మారుతి ప్రసాద్, ఇర్షాద్, అమునుద్దన్, కిరణ్, కోచ్ హుస్సేన్ పాల్గొన్నారు.

జిల్లా న్యాయాధికారిగా భీమారావు

నెల్లూరు జిల్లా న్యాయాధికారిగా శ్రీనివాస్ బదిలీ

అనంతపురం క్రైం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన న్యాయాధికారిగా ఈ. భీమారావు నియమితుడయ్యారు. చిత్తూరు జిల్లా న్యాయాధికారిని జిల్లాకి నియమించారు. జిల్లా న్యాయాధికారి జి.శ్రీనివాస్‌ను నెల్లూరు జిల్లా న్యాయాధికారిగా బదిలీ చేశారు. ఈ మేరకు సోమవారం హైకోర్టు రాష్ట్ర వ్యాప్తంగా పలువురు జిల్లా న్యాయాధికారులు, అదనపు జిల్లా న్యాయాధికారులను బదిలీలు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 21వతేదీలోపు బాధ్యతలు చేపట్టాలని అందులో పేర్కొంది. అనంతపురం పోక్సో కోర్టు న్యాయాధికారి టి.రాజ్యలక్ష్మిని ఒంగోలు మొదటి అదనపు జిల్లా న్యాయాధికారిగా బదిలీ చేశారు. మచిలీపట్నం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి ఎస్.చిన్నబాబును అనంతపురం పోక్సో కోర్టుకు బదిలీ చేశారు. కడప జిల్లా న్యాయాధికారి జి.శ్రీదేవిని అనంతపురం ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ లేబర్ కోర్టు న్యాయాధికారిగా బదిలీ చేశారు. గుత్తిలోని ఆరో అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శ్రీహరిని తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం 12వ అదనపు జిల్లా న్యాయాధికారిగా బదిలీ చేశారు. అనంతపురం నాలుగో అదనపు జిల్లా న్యాయాధికారిగా ఎం.శోభారాణిని ఖాళీగా ఉన్న కర్నూలు సీబీఐ కోర్టుకు బదిలీ చేశారు.

చీనీ టన్ను రూ.25 వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.25వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 1326 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రెచ్చగొట్టకు.. చిచ్చు పెట్టకు..!

● బాధితులకు సాయం చేసి వెళ్లు ● జగన్‌కు పరిటాల సునీత సూచన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి/పెనుకొండ టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజలను రెచ్చగొట్టకుండా, వారి మధ్య చిచ్చు పెట్టకుండా, బాధిత కుటుంబానికి సాయం చేసి వెళ్లాలని మాజీ సీఎం జగన్‌కు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. పాపిరెడ్డిపల్లికి మంగళవారం జగన్ వస్తున్న నేపథ్యంలో రామగిరిలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గతంలో పరిటాల రవీంద్ర పులివెందులకు వెళ్లినప్పుడు జగన్ కుటుంబం అడ్డుకుందని, అందుకే ఇప్పుడు జగన్‌ను అడ్డుకోవాలని తమ పార్టీ కార్యకర్తలు, పరిటాల అభిమానులు సూచిస్తున్నారని ఆమె అన్నారు. కానీ అది తమ సంస్కృతి కాదని స్పష్టం చేశారు. పాపిరెడ్డిపల్లిలో అనుకోకుండా ఆ సంఘటన జరిగిందని, దాన్ని పరిటాల కుటుంబానికి ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ప్రకాశ్‌రెడ్డి మాటలు విని ఒక మాజీ ముఖ్యమంత్రి రావడం సరైందికాదని అన్నారు. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, ప్రకాశ్ రెడ్డి మధ్య వార్ జరుగుతోందని, వారిద్దరూ జగన్‌ను తీసుకురావడానికి పోటీ పడ్డారని అన్నారు. జగన్ రెడ్డిని రానివ్వకుండా అడ్డుకుంటున్నారని ప్రకాశ్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారని, దీని వల్ల కూడా లబ్ధిపొందే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వైసీపీవారి రెచ్చగొట్టే వ్యాఖ్యలను పట్టించుకోవద్దని, సంయమనం పాటించాలని టీడీపీ నాయకులు సూచించారు. జగన్ పర్యటన గురించి పట్టించుకోవద్దని కోరారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు: ఎస్పీ

మాజీ సీఎం జగన్ రాక సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ రత్న తెలిపారు. పెనుకొండ డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. లింగమయ్య హత్యకేసు నిందితులను 48 గంటల్లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. పాపిరెడ్డిపల్లి చిన్న గ్రామమని, ఇరుకు రోడ్లు ఉన్నందున ఎక్కువ సంఖ్యలో ప్రజలు రావడానికి వీలుకాదని ఆమె అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వైసీపీ నాయకులు పోలీసుల సూచనల మేరకు నడుచుకోవాలని కోరారు. మాజీ సీఎంతోపాటు నిర్దేశించిన నాయకులు మాత్రమే గ్రామ సందర్శనకు రావాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు జగన్ రాక

మాజీ సీఎం వైఎస్ జగన్ మంగళవారం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి వస్తున్నారు. ఇటీవల జరిగిన ఘర్షణలో మృతి చెందిన వైసీపీ కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శిస్తారు. చెన్నేకొత్తపల్లిలో హెలిప్యాడ్ ఏర్పాటుకు పోలీసులు అనుమతి నిరాకరించారు. కుంటిమద్ది హైస్కూల్‌లో జగన్ దిగేలా హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి లింగమయ్య ఇంటికి పది నిమిషాల్లో వెళ్లేలా పోలీసులు చర్యలు చేపట్టారు. వైసీపీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలసిల రఘురాం హెలిప్యాడ్‌ను సోమవారం పరిశీలించారు. జగన్ మంగళవారం ఉదయం 10 గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరుతారు. మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుగుప్రయాణమౌతారు.

70 రోజుల్లో పూర్తికావాలి

హంద్రీనీవా కాలువ పనులపై అధికారులకు మంత్రి కేశవ్ దిశానిర్దేశం

ఉరవకొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు 70 రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ దిశానిర్దేశం చేశారు. కాలువ పనులు పూర్తి చేసి, జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించిన మరుసటి రోజే పనులు ప్రారంభించామనీ, జిల్లా ప్రజల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో చేపడుతున్న హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను అధికారులతో కలిసి మంత్రి సోమవారం పరిశీలించారు. మండలంలోని చిన్నముష్టూరు సమీపంలో హంద్రీనీవా కాలువ పనులపై హెచ్ఎన్ఎస్ఎస్ సీఈ నాగరాజు, ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్, ఈఈ శ్రీనివాస్‌నాయక్‌తో చర్చించారు. కాలువ లైనింగ్ పనులు, పూడిక తొలగింపుపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. 70 రోజుల్లోనే కాలువ వెడల్పు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు మంత్రి ఆదేశించారు. అనంతరం 33, 34, 35 ప్యాకేజీల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ.. హంద్రీనీవా కాలువ సామర్థ్యం పెంపు పనులకు 2014, 2019ల్లో టీడీపీ హయాంలో శ్రీకారం చుట్టామన్నారు. అప్పట్లోనే 40శాతం పనులు కూడా పూర్తి చేశామన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో తట్టెడు మట్టి కూడా తీయలేదన్నారు. మరలా తాము అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రికి జిల్లాపై ఉన్న ప్రత్యేక శ్రద్ధతో చరిత్రలో ఎన్నడూలేని విధంగా రూ.3800 కోట్లు కేటాయించారన్నారు. ఒక్క పోలవరం మినహా, ఏ ప్రాజెక్టుకు ఇంతస్థాయిలో నిధులు కేటాయించిన దాఖలాలు లేవన్నారు. జిల్లాలో హంద్రీనీవా కాలువ 82 కి.మీలు ఉందనీ, ఇప్పటికే 12 కి.మీలు కాలువ వెడల్పు పనులు పూర్తి చేశామన్నారు. జూన్ 10 నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నామన్నారు. పనులు పూర్తయితే, ఇది ఇంజనీరింగ్ అద్భుతమన్నారు. 20ఏళ్లలో జరగని పనిని 70 రోజుల్లో పూర్తి చేయాలన్నదే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. గత ప్రభుత్వం కనీసం కాలువపై కంపచెట్లు కూడా తొలగించలేదన్నారు. ఐదేళ్లలో గత పాలకులు కాలువలో తట్టెడు మట్టి కూడా తీయలేదని ధ్వజమెత్తారు. జిల్లాలో తొలి దశలో లైనింగ్ పనులు చేయడం లేదన్నారు. వైసీపీ హయాంలోనే లైనింగ్ చేయడానికి టెండర్లు పిలిచారని గుర్తుచేశారు. ఆరోజు ఒక్కరూ నోరు మెదపలేదన్నారు. ప్రజల మీద ప్రేమ కనబడలేదా అని ప్రశ్నించారు. గతంలో మాజీ సీఎం ఉరవకొండకు వచ్చి జలదీక్ష చేపట్టారనీ, ఆ సందర్భంగా మూడు నెలల్లో హంద్రీనీవా పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత మరచిపోయారన్నారు. తమ ప్రభుత్వం హంద్రీనీవా పనులపై కమిట్‌మెంట్‌తో పనిచేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు పనుల పర్యవేక్షణకు వస్తారని ఆశిస్తున్నామనీ, వచ్చే సీజన్‌కు 8 నుంచి 9 మోటార్లు వాడేలా చర్యలు చేపడుతున్నామన్నారు. మల్యాల నుంచి జీడిపల్లి వరకూ కాలువ పనులు జరుగుతున్నాయన్నారు. ఇవి పూర్తయితే కాలువలో 3800 క్యూసెక్కుల నీరు ప్రవహించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో జరగని లైనింగ్ పనులపై వైసీపీ నేతలు ఆందోళన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయన్నారు. అక్కడ కొందరు లైనింగ్ కావాలని అడుగుతున్నారని మంత్రి ఉద్ఘాటించారు. కార్యక్రమంలో డీఈ పీవీ రమణ, జేఈలు భాస్కర్, రాఘవేంద్ర, గౌస్‌బాషా, ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రేగాటి నాగరాజు, మాజీ ఎంపీపీలు ప్రతాప్‌నాయుడు, సుంకరత్నమ్మ, మండల కన్వీనర్లు విజయ్ భాస్కర్, నూతేటి వెంకటేశులు పాల్గొన్నారు.


చిన్నముష్టూరు వద్ద కాలువ పనులను పరిశీలిస్తున్న మంత్రి కేశవ్

డ్రిప్ మంజూరులో టాప్

జాతీయ స్థాయిలో అనంతకు రెండోస్థానం: కలెక్టర్

ఏపీఎంఐపీ, కంపెనీలకు అభినందనలు


మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): డ్రిప్ పరికరాల మంజూరులో జాతీయ స్థాయిలో అనంత జిల్లా రెండో స్థానం, రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్ ఖాన్ తదితరులు కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ్‌శర్మను శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 18వేల హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింకర్ల మంజూరుకు లక్ష్యం విధించారని తెలిపారు. జిల్లాలోని 14,869 మంది రైతులకు 17,642 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింకర్లు (98 శాతం) మంజూరు చేశామని అన్నారు. జాతీయ స్థాయిలో డ్రిప్ పరికరాల మంజూరులో రెండో స్థానం, రాష్ట్రంలో మొదటి స్థానం రావడానికి కృషి చేసిన ఏపీఎంఐపీ అధికారులు, సిబ్బంది, డ్రిప్ కంపెనీల ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఈ ఆర్థిక సంవత్సరం సకాలంలో రైతులకు డ్రిప్ పరికరాలు మంజూరుతోపాటు సరఫరా చేయాలని సూచించారు.

అర్బన్ హెల్త్ సెంటర్లలో సమస్యలు పరిష్కరించాలి

- ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి


సర్వే నిర్వహిస్తున్న ఐద్వా నేతలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 7(ఆంధ్ర జ్యోతి): అర్బన్ హెల్త్ సెంటర్లలో పూర్తి స్థాయిలో వైద్యసేవలందించేందుకు వీలుగా అక్కడ నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి డిమాండ్ చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అర్బన్ హెల్త్ సెంటర్లలో అందుతున్న వైద్య సేవలపై సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో నగరంలో పలు ప్రాంతాల్లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడుతూ... సర్వే సందర్భంగా తమ దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నా ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందలేదన్నారు. రాజీవ్ కాలనీ 49వ డివిజన్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో సర్వేకు వెళ్లినపుడు అక్కడి స్థానిక ప్రజలు, రోగులు అనేక సమస్యలు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. గైనకాలజిస్ట్, లేబర్ రూమ్, ప్రీ అడ్మిషన్ డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. చిన్నపిల్లల డాక్టర్లు లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, కోశాధికారి చంద్రిక, ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవల బంద్‌కు ఆస్పత్రుల నిర్ణయం

కలెక్టర్‌కు నోటీసు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బకాయిలు చెల్లించే వరకు ఎన్టీఆర్ వైద్యసేవలు నిలిపి వేయాలని నెట్‌వర్క్ ఆస్పత్రులు నిర్ణయించాయి. నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోనూ వైద్యసేవలు నిలుపుదల చేస్తున్నామని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో.. కలెక్టర్‌కు సోమవారం నోటీసు పంపారు. ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ (డీసీ)కి కూడా పంపారు. జిల్లాలో 49 ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవలు అందిస్తున్నారు. అధికారిక లెక్కల మేరకు రోజూ 120 నుంచి 140 వరకు వివిధ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం వైద్యసేవ బిల్లులు అందించకుండా పెండింగ్ పెడుతూ వచ్చింది. దీంతో బకాయిలు పేరుకుపోయాయి. వాటిని చెల్లించడానికి నూతన ప్రభుత్వం ఇబ్బందులు పడుతోంది. ఇదివరకు కూడా సేవలు నిలుపుదల చేస్తామని ప్రకటించగా.. బకాయిలను కొంతమేర విడుదల చేసింది. జిల్లాలో రూ.80 కోట్ల వరకు బకాయిలు ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. ఇందులో గత వైసీపీ హయాంలో పెండింగ్ పెట్టినవే రూ.60 కోట్ల వరకు ఉంటాయని తెలుస్తోంది. సేవల బంద్‌కు నోటీస్ ఇచ్చిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. నెట్‌వర్క్ ఆస్పత్రులు నోటీసు ఇచ్చినా.. జిల్లాలో వైద్యసేవలు యథాతథంగా కొనసాగుతున్నాయని జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సీరియస్ కేసులకు వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. సోమవారం కూడా 90 మందికి శస్త్ర చికిత్సలు చేయడానికి ఆయా ఆస్పత్రులు.. ఆన్‌లైన్ అప్‌లోడ్ చేశాయన్నారు. ఎక్కడా ఇబ్బందిలేకుండా జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవలు అందుతున్నాయని ఆయన వివరించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


నంబూరి ప్రసాద్ (ఫైల్)

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచువారిపల్లిలో సోమవారం విద్యుదాఘాతంతో రైతు నంబూరిప్రసాద్ (46) మృతిచెందాడు. బంధువులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నంబూరి ప్రసాద్ దోస, వరి, కలింగర పంటలు సాగు చేశాడు. పంటలకు తడులిచ్చేందుకు సోమవారం మధ్యాహ్నం పొలం వద్దకెళ్లాడు. మోటారు ఆన్ చేయబోగా.. విద్యుత్ సరఫరా కాలేదు. ట్రాన్స్‌ఫార్మర్ వద్దకెళ్లి చూడగా.. ఫ్యూజు కాలిపోయింది. ఫ్యూజు వేస్తుండగా.. విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. అంతకు మునుపు తోట వద్దకు రావాలని మిత్రులకు ఫోన్ ద్వారా తెలిపాడు. వారు పొలం వద్దకు వెళ్లగా విగతజీవిగా పడివున్న ప్రసాద్‌ను చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రమాద స్థలాన్ని ఏఎస్ఐ ప్రసాద్ పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. రైతుకు భార్య చంద్రకళ, కుమార్తెలు తేజస్విని, హర్షిత ఉన్నారు.

వేర్వేరుచోట్ల ఇద్దరు యువకుల ఆత్మహత్య

తాడిపత్రి, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): మండలంలో వేర్వేరుచోట్ల సోమవారం ఇద్దరు యువకులు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. స్థానిక పోరాటకాలనీకి చెందిన నవీన్‌కుమార్ (30) యల్లనూరు రోడ్డు రైల్వే గేట్ సమీపాన సోమవారం రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నవీన్‌కుమార్ వ్యాన్ డ్రైవర్. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటివద్దనే ఉండేవాడు. వాహనానికి తెచ్చిన, చికిత్స కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని మదనపడుతుండేవాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది, రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి కి భార్య భార్గవి, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోమలి సమీపంలో మరొకరు...

మండలంలోని కోమలి గ్రామ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం చిన్నపొలమడ గ్రామానికి చెందిన నారాయణస్వామి (30) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్నపొలమడ గ్రామానికి చెందిన పుల్లయ్య, రాజమ్మ దంపతుల కుమారుడు నారాయణస్వామి అనారోగ్యంతో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తిచెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు.

వృద్ధురాలి మృతి

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ నాలుగో నెంబర్ ప్లాట్‌ఫాం ఆవరణలో ఓ వృద్ధురాలు (65) ప్రమాదవశాత్తూ కింద పడి సోమవారం మృతి చెందారు. రైల్వే ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలం వద్ద ఆధారాలపై ఆరా తీశారు. ఎలాంటి ఆధారాలు దొరక్కపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకొని, ప్రభుత్వ వైద్యశాలకు తరలించి నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

నేడు ఏఐఆర్ఆర్ఎఫ్ ధర్నా

గుంతకల్లు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పెన్షన్ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గుంతకల్లు రైల్వే డివిజనల్ కేంద్రంలో మంగళవారం ఉదయం ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐఆర్ఆర్ఎఫ్ డివిజనల్ అధ్యక్షుడు జయంత్ కుమార్, కార్యదర్శి సుంకప్ప ప్రకటనలో తెలిపారు. కేంద్రం పెన్షన్ నియమాలకు ప్రమాదకరమైన సవరణలను చేసిందన్నారు. ఉద్యోగ విరమణ తేదీల ఆధారంగా పెన్షనర్లను వర్గీకరిస్తారన్నారు. దీంతో 8వ సీపీసీ లభించే హక్కుకు భంగం వాటిల్లుతుందన్నారు. దీనిని నిరసిస్తూ మంగళవారం ఉదయం 11 గంటలకు తమ సంఘ కార్యాలయం నుంచి ర్యాలీ చేపడతామన్నారు. డీఆర్ఎం ఆఫీసుకు చేరుకుని, అక్కడ నిరసన తెలుపుతుమన్నారు.

మే 17న జేఎన్టీయూ స్నాతకోత్సవం: వీసీ

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవాన్ని మే 17వ తేదీన నిర్వహించుకునేందుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ అనుమతి ఇచ్చారని వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. స్నాతకోత్సవ సన్నాహాలపై అధికారులతో సోమవారం వర్సిటీలో సమీక్ష నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ.. పట్టాల ప్రదానోత్సవం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వేలాది మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. సమన్వయంతో పనిచేసి, స్నాతకోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, పలువురు డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖలోని పలు విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హులైన అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ నాగమణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐసీడీఎస్ పరిధిలోని చిల్డ్రన్స్ హోంలో ఖాళీగా ఉన్న స్టోర్ కీపర్ కం అకౌంటెంట్(కాంట్రాక్టు), హౌస్ కీపర్(అవుట్‌సోర్సింగ్), ఎడ్యుకేటర్ (పార్ట్‌టైం), పీటీ ఇన్‌స్ట్రక్టర్ కం యోగా టీచర్ (పార్ట్‌టైం), మ్యూజిక్ టీచర్ (పార్ట్‌టైం) ఉద్యోగాల భర్తీ చేస్తామన్నారు. జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అర్హులైన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆమె సూచించారు.

గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉక్రెయిన్ యుద్ధ సమయంలో రష్యా నుంచి చౌకగా ముడిచమురు వస్తే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించకుండా అంబానీ కోట్లు దోచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కారణమైందని విమర్శించారు. ఓ వైపు మతభావాలను రెచ్చగొట్టడం, మరోవైపు ప్రజలపై భారాలు వేయడం బీజేపీ విధానం అన్నారు. వక్ఫ్ చట్టం చుట్టూ చర్చను లేవనెత్తి, గృహసిలిండర్లకు, ఉజ్వల పథకం లబ్ధిదారులకు సిలిండర్‌పై రూ.50లు పెంచడం దారుణం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాస్ పథకంపైనా ఈ భారం పడుతుందన్నారు. గ్యాస్ ధరలను తగ్గించేలా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒత్తిడి తేవాలని కోరారు.

యథేచ్ఛగా ప్లాస్టిక్ వాడకం

• పుట్టపర్తిలో కనిపించని నిషేధం • పట్టించుకోని అధికారులు



పాలిథిన్ కవర్‌లో కూరగాయలు తీసుకుంటున్న వినియోగదారుడు



ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయిన చెత్తకుండీ

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఇబ్బడి ముబ్బడిగా ప్లాస్టిక్‌ను వినియోగించడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని పర్యావరణ వేత్తలు గగ్గోలు పెడుతున్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టకపోతే మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తదుపరి చర్యలకు ఉపక్రమించాల్సిన అవసరం ఉందని పర్యావేరణ వేత్తలు ప్రభుత్వాలకు సూచిస్తున్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల్లో ప్లాస్టిక్ వినియోగంపై నిబంధనలు విధించారు. నూతనంగా ఏర్పడిన శ్రీసత్యసాయి జిల్లాలో ఆ వైపు అధికారులు దృష్టిసారించడం లేదని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అర్థమవుతోంది. పర్యావరణ పరిరక్షణ కోసం ఉమ్మడి జిల్లాలో తాడిపత్రి మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నారు.

● ఆధ్యాత్మిక కేంద్రంలో అంతంత మాత్రమే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తికి వివిధ దేశాల నుంచి నిత్యం ఎందరో సత్యసాయి భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడ సైతం అధికారులు ప్రకటనలే తప్ప ప్లాస్టిక్ నిషేధంపై శ్రద్ధచూపడం లేదు. పట్టణంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా కనిపిస్తోంది. కిరాణా, కూరగాయల దుకాణాలు, హోటళ్లలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం ఎక్కువగా కనిపిస్తోంది. దుకాణాలకు వెళ్లే వినియోగదారులు సైతం సంచులు తీసుకెళ్లడం లేదు. ఈ తంతు జిల్లా మొత్తం జరుగుతోంది. దుకాణదారులు ఇచ్చే ప్లాస్టిక్ కవర్లపైనే ఆధారపడుతున్నారు. హోటళ్లలో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు కూడా అధికంగా వాడుతున్నారు. మందుబాబులు ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ గ్లాసులు పడేస్తున్నారు. దీంతో పంటపొలాలు, చెరువులు, నదులు, వంకలు, వాగులు, ఎక్కడచూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ నిషేధంపై అధికారులు పట్టించుకోలేదు.

ఇవీ ప్లాస్టిక్‌పై నిబంధనలు

● 75 మైక్రాన్ల కంటే ఎక్కువ మందం ఉన్న పాలిథిన్ కవర్లను మాత్రమే వినియోగించాలి.

● నిబంధనలు పాటించని వర్తకులు, వినియోగదారుల నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలి.

● నార, కాగితం, క్లాత్‌తో చేసిన జూట్ సంచులను మాత్రమే తయారు చేసి వర్తకులకు విక్రయించాలి. వారపు సంతలు, కూరగాయలు, కిరాణా, ఇతర దుకాణాల్లో వీటినే అందుబాటులో ఉంచాలి.

● పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను అనుమతించరాదు.

● ప్రతిపర్యాటక ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధం బోర్డులను ఏర్పాటు చేయాలి.

జరిమానాలు విధిస్తాం



ప్లాస్టిక్ నియంత్రణపై ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశాం. ప్లాస్టిక్ సంచులను వినియోగించినా, అమ్మినా జరిమానాలు విధిస్తాం. షాపుల లెసెన్సులను రద్దుచేస్తాం. రూ.200 నుంచి రూ.50వేల వరకు జరిమానాలు విధిస్తాం. పటిష్టంగా ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తాం.

-ప్రహ్లాద, మున్సిపల్ కమిషనర్

న్యూస్ బాక్స్

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మండలంలో మంగళవారం పర్యటిస్తారని టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు వడ్డివారిపల్లి వద్ద మహిళ సమాఖ్య భవనంలో మహిళలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణలో పాల్గొంటారన్నారు. అనంతరం రామిరెడ్డిపల్లిలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో, మధ్యాహ్నం రెండు గంటలకు అమడగూరులో వ్యవసాయగోడౌన్‌లో మహిళలకు ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణలో పాల్గొంటారని తెలిపారు.

● నల్లమాడ: ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మంగళవారం మండలంలో పర్యటిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ తెలిపారు. నల్లమాడ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలు మహిళకు ప్రభుత్వం ఇస్తున్న కుట్టు శిక్షణ ప్రారంభోత్సవంలో వీరు పాల్గొంటారన్నారు.

జగన్ ద్వంద్వ వైఖరి వీడాలి: టీడీపీ



కృష్ణమూర్తి

తనకల్లు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ద్వంద్వవైఖరి మానుకోవాలని టీడీపీ రాష్ట్ర సభ్యుడు కృష్ణమూర్తి హితవు పలికారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు విషయంలో వైసీపీ నాయకులు ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నారని, రాజ్యసభలో మద్దతు ప్రకటించి, బయట మాత్రం వారు వక్ఫ్ బోర్డు రద్దుకు వ్యతిరేకమని చెప్పుకోవడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శమన్నారు. ముస్లింలు ఈ వైఖరీని గమనిస్తూనే ఉన్నారని, వైసీపీ చెప్పే మాటలను నమ్మే స్థితిలో వారు లేరని అన్నారు. వైసీపీ నాయకులు ద్వంద్వ వైఖరి వీడి స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు.

10లోపు ఇంటిపట్టా పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వండి

నంబులపూలకుంట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మంజూరుకు దరఖాస్తు చేసుకున్న ప్రభుత్వ గృహ లబ్ధిదారులు గురువారంలోపు ఇంటిపట్టా పోజిషన్ సర్టిఫికెట్‌ను అందచేయాలని హౌసింగ్ ఏఈ శ్రావణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. ఇంటి నిర్మాణం కోసం మండలంలో 740మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. దరఖాస్తుదారుల పేరుతో ఇంటి పట్టా పోజిషియన్ సర్టిఫికెట్ గాండ్లపెంట హౌసింగ్ కార్యాలయంలో గురువారంలోపు అందించాలన్నారు. లబ్ధిదారుల భార్య, భర్తల ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంక్‌ఖాతా, ఉపాధి జాబ్ కార్డు, కుల, ఆదాయ పత్రాలు, ఇంటిపట్టా జత చేసి ఇవ్వాలన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



ముదిగుబ్బలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ముదిగుబ్బ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మలకవేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణవేణి, రాణి, ఏఎన్‌ఎంలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

● ధర్మవరంరూరల్ : ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురష్కరించుకుని సోమవారం మండలంలోని దర్శినమల గ్రామంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి పుష్పలత ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. పీఎంజేఏవై కార్డుల ద్వారా 70 సంవత్సరాల పైబడిన వారు ఉచితంగా రూ. 5లక్షల వరకు ఆరోగ్య సేవలు పొందవచ్చున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్ ప్రారంభం

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ, ఆర్టీటీ సెట్ ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ తరగతులను స్థానిక వివేకానంద కళాశాలలో సోమవారం ప్రారంభించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, కళాశాల వద్దకు వచ్చి పేర్లు నమోదు చేసుకుని తరగతులకు హాజరుకావాలని కోచింగ్ ఇస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ హర్ష తెలిపారు.

న్యాయవాదులపై దాడులకు నిరసన

కదిరిలీగల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు కదిరి న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం సమావేశమై అధ్యక్షుడు కే చౌడప్ప ఆధ్వర్యంలో ఓ తీర్మానాన్ని ఆమోదించారు. ప్రత్యేకించి హైకోర్టు న్యాయవాది కొత్తపల్లి అయ్యప్పపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. న్యాయవాదులపై దాడులు ఆపాలని, అందుకోసం సోమ, మంగళవారం రెండు రోజులపాటు కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలపాలని తీర్మానించారు. తీర్మాన కాపీలను సంబంధిత అధికార వర్గాలకు పంపారు. న్యాయవాదులందరూ ఐక్యతతో ఉద్యమించకపోతే నిరసన తెలుపకపోతే పరిస్థితి మరింత దిగజారిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సురేంద్ర, న్యాయవాదులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

కదిరి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణానికి తాగునీటి సరఫరాలో ఈ నెల 8 నుంచి 17 వరకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. చిత్రావతి రిజర్వాయర్ దొరిగిల్లు పంప్ హౌస్‌లో తాగునీటి సరఫరా చేసేందుకు రెండు మోటార్లు ఉన్నాయని, ఇందులో ఒక మోటారు చేడిపోయిందని చెప్పారు. ఈ కారణంగా ఒక మోటర్‌తోనే తాగునీటి సరఫరా చేస్తామని, అందువల్ల తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఈ విషయాన్ని గమనించి ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

పురుగు మందుల వినియోగంలో జాగ్రత్త

కదిరిఅర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తమ సూచన మేరకే రైతులు పురుగుమందులు వాడాలని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. సోమవారం కుటాగుళ్ల వద్ద చౌడేశ్వరీ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రబీలో సాగుచేసిన వేరుశనగ పంటను పరిశీలించిన వారు మాట్లాడారు. పొలంబడిలో భాగంగా రైతులకు పురుగుమందుల వాడకంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఓపీసీఏ ఇన్‌స్పెక్టర్ రవి, ఏడీఏలు సత్యనారాయణ, సనావుల్లా, ఏఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ధర్మవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీచెన్నకేశవపురంలో ఉన్న అంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం సాయంత్రం మానస నృత్య కళాకేంద్రం కళాకారులు ప్రదర్శించిన నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ఆవరణంలో గురువు మానస ఆధ్వర్యంలో 20 మంది కళాకారులు శ్రీరామచంద్రుని సంకీర్తనలతో చేసిన నృత్యం పలువురిని ఆకట్టుకుంది. దీంతో ఆలయ కమిటీ సభ్యులు ఆ కళాకారులను సన్మానించారు.



నృత్యం చేస్తున్న కళాకారులు



ఆవుపై గోనె సంచులు ఉంచి.. నీరు చల్లుతున్న పాడి రైతు

ఉక్క పాట్లు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వేడి తాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇక మూగజీవాల బాధ వర్ణణాతీతం. వాటికి ఉపశమనం కలిగించడానికి పాడి రైతులు నానా పాట్లు పడుతున్నారు. మండలంలోని నారప్పగారిపల్లికి చెందిన పాడి రైతు రామాంజులు తన పాడి ఆవులపై ఇలా గోనె సంచులు కప్పి నీటితో తడుపుతూ వాటికి ఉపసమనం కలిగేలా చేస్తున్నాడు.

ఆకతాయిలను అడ్డుకోండి





మైదానంలో ఉన్న మద్యం బాటిళ్లు, ధ్వంసమైన సిమెంట్ బెంచీలు

కదిరి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర, డిగ్రీకళాశాల మైదానాల్లో రాత్రి సమయంలో ఆకతాయిలు వీరంగం సృష్టిస్తున్నారని, వారిని అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఆ ఆకతాయిలు మద్యం సేవించి.. బాటిళ్లను పగలగొట్టి పారేస్తున్నారని, ఉదయం వాకింగ్ వెళ్లిన వారికి, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఆ గాజు పెంకులు గుంచుకుని గాయపడుతున్నారన్నారు. అంతేకాకుండా ఆ ఆకతాయిలు అక్కడున్న సిమెంట్ బెంచీలను ధ్వంసం చేస్తున్నారన్నారు. వీరిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గురుకుల పాఠశాలలో తాగునీటికి పాట్లు



తాగునీటి కోసం విద్యార్థులు పడుతున్న పాట్లు

కదిరి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీపంలోని డిగ్రీ కళాశాల వద్ద ఉన్న ఎస్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు తాగునీటికి నానా పాట్లు పడుతున్నారు. దాదాపు మూడువందలమందికిపైగా విద్యార్థులు ఈ పాఠశాలలో తాగునీటి కోసం ఒకే ఒక తాగునీటి ప్లాస్టింక్ ట్యాంక్‌ను తాత్కాలికంగా ఏర్పాటుచేశారు. ఆ ట్యాంక్‌లోని నీటితోనే ఆ విద్యార్థులందరూ దాహార్తిని తీర్చుకొంటున్నారు. దీంతో ఆ నీరు అంతమంది విద్యార్థులకు సరిపోవడం లేదు. సోమవారం ట్యాంక్‌లో అడుగున్న ఉన్న నీటి కోసం ఇద్దరు విద్యార్థులు ట్యాక్‌ను ఓ వైపు వంచగా.. మిగిలిన విద్యార్థులు నీటిని పట్టుకోవడం కనిపించింది.

టీడీపీ సభ్యత్వ కార్డుల అందజేత

ధర్మవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మంగళగిరి కార్యాలయం నుంచి వచ్చిన టీడీపీ సభ్యత్వ కార్డులను స్థానిక గాంధీనగర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ కమతం కాటమయ్య వార్డులు, బూత్‌లవారీగా ఆయా నాయకులకు సోమవారం అందజేశారు. ఈ కార్డులను సభ్యత్వం చేయించుకున్న ప్రతి కార్యకర్తకు తప్పకుండా అందజేయాలన్నారు. సభ్యత్వ కార్డు వల్ల కలిగే లాభాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి పురుషోత్తగౌడ్, నాయకులు అంబటి సనత్, కేశగాళ్లశీన, తోట నారాయణ స్వామి, అద్రమహేశ్, కత్తుల బాబ్జీ, లోకేశ్ పాల్గొన్నారు.



టీడీపీ సభ్యత్వకార్డులను అందజేస్తున్న నాయకులు

కొనసాగిన వేమన ఉత్సవాలు



విద్యుద్దీపాలతో అలంకరించిన చాందినీ బండి

ఆకట్టుకున్న రంగురంగుల చాందినీ బండ్లు

గాండ్లపెంట, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లిలో శ్రీయోగి వేమన ఉత్సవాలను భాగంగా రెండో రోజైన సోమవారం ఘనంగా నిర్వహించారు. రాత్రి చాందినీ బండ్ల మెరవన నిర్వహించారు. మొక్కులు తీర్చుకోవడానికి రంగురంగుల విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన చాందినీ బండ్లను ఏర్పాటు చేశారు. బాణసంచా పేల్చుతూ ఈబండ్ల ముందు వి విధ రకాల సంస్కృతిక కా ర్యక్రమాలు నిర్వహించారు. యోగివేమన జీవ సమాధిని ఎమ్మెల్యే కంది కుంట వెంకటప్రసాద్ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమం రాత్రి 10 గంటల నుంచి తెల్లవారు జాము వరకు నిర్వహించి.. వేమన ఆలయానికి చేరుకుంటారు. భక్తులు బండల్లో పానకం పంచుతూ మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణంలో సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. వేలాది మంది ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



హాజరైన భక్తులు

అన్నమయ్య జిల్లా వాసులకు తనకల్లులో భూపట్టాలు

రద్దు చేయాలని వినతి

తనకల్లు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతపల్లి గ్రామంలోని భూములను అన్నమయ్య జిల్లా మొలకలచెరువు మండలానికి చెందిన అనేక మందికి పట్టాలు ఇచ్చారని, వాటిని రద్దు చేసి.. అర్హులైన స్థానికులకు ఇవ్వాలని కాంగ్రెస్ మండల డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కాంగ్రెస్ మండల కన్వీనర్ తోపు పారేసు, దళిత నాయకుడు రవికుమార్ తహసీల్దార్ శోభాసువర్ణకు వినతిప్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. బొంతపల్లిలోని 183 సర్వే నెంబర్‌లో రూ.కోట్ల విలువ చేసే రెండు ఎకరాల భూ పట్టాను మొలకలచెరువు మండలానికి చెందిన శారదకు మంజూరు చేశారన్నారు. ఇలా పదుల సంఖ్యలో మొలకలచెరువు మండలానికి చెందిన వారికి ఇక్కడ పట్టాలు మంజూరు చేశారన్నారు. ఇంత విలువైన భూమిని పక్క జిల్లా వాసులకు ఎందుకు పట్టాల్సించారో రెవెన్యూ అధికారులకే తెలియాలన్నారు. ఆ భూమిని వెంటనే రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని పేదలకు ఇంటిపట్టాలివ్వాలని కోరారు లేని పక్షంలో పేదలతో కలిసి గుడిసెలు వేసి, ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయాన్ని పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.



తనకల్లు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

● దోబీఘాట్ ఏర్పాటు చేయాలి

కదిరిఅర్బన్ : మున్సిపల్‌పరిధిలోని కుటాగుళ్లలో దోబీ ఘాట్, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ మురళీక్రిష్ణకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, గంగన్న, నారాయణ, శివశంకర్, వెంకటేష్, శివన్న, గంగరాజు, పి.శంకర్, ఆదినారాయణ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడి

ఫుట్‌పాత్ నిర్మాణానికి భూమిపూజ

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని ఆర్టీసీ డిపో వద్ద నుంచి వెటర్నరీ ఆసుపత్రి వరకు ఫుట్‌పాత్ నిర్మాణానికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. ఈ పనులకు రూ.7 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ పనుల్లో ఏమాత్రం తగ్గరాదని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, డీఈ నరసింహమూర్తి, కౌన్సిలర్ వెంకటరమణమ్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ చలపతి, చిమిరాల సుధాకర్, టీడీపీ పట్టణకన్వీనర్ రామాంజినేయులు, రూరల్ కన్వీనర్ విజయ్‌కుమార్, సామకోటి ఆదినారాయణ పాల్గొన్నారు.

● పాఠశాల తనిఖీ: మున్సిపల్ పరిధిలోని బీడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరపట్టిని పరిశీలించారు. పాఠశాలలోని సమస్యలపై ఆరా తీవారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తేవాలన్నారు.

'మధ్యాహ్నం' చిరుధాన్యాల వంటలు వడ్డించాలి



పోస్టుకార్డులతో విద్యార్థులు

కదిరి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనంలో వారానికి ఒక మారు చిరుధాన్యాల వంటలను వడ్డించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ రాష్ట్ర కన్వీనర్ చింతా శరత్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మూడు వందల మంది విద్యార్థులు ఆయన ఆధ్వర్యంలో పోస్టుల్ కార్డులు రాసి. విద్యాశాఖమంత్రి నారాలోకేష్‌కు పంపారు. ఆయన మాట్లాడుతూ ఇలా చేయడం వల్ల పిల్లల ఆరోగ్యం బాగు పడటంతో పాటు చిరుధాన్యాల రైతులను ఆదుకున్నట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, నారాయణ పాల్గొన్నారు.

పంట పండింది..



వంకమద్ది చెరువు కింద సాగుచేసిన వరిపంట

నంబులపూలకుంట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకమద్ది ఆయకట్టు కింద సాగుచేసిన వరి పంట కాపు బాగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రబీలో వంకమద్ది చెరువు కింద మూడు వందల ఎకరాల్లో వరిపంటను సాగుచేశారు. ఆయకట్టుకింద వంకమద్ది, ఎస్పీకుంట, మరికొమ్మెదిన్నె, గురికానివారిపల్లి, బందారుచెట్లపల్లి, నల్లగుట్లపల్లి గ్రామాల రైతుల భూములున్నాయి. వంకమద్ది చెరువులో ఒక పంటకు కావలసిన నీరుండడంతో రబీలో సాగు వరి దిగుబడి ఎకరాకు 30 నుంచి 40 బస్తాలు వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన భక్తిగీతాలు



పాటలు ఆలపిస్తున్న భక్తులు

పుట్టపర్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):తెలంగాణ భక్తులు భక్తిగీతాల ఆలాపనతో భక్తులను అలరింపచేశారు. సోమవారం సాయికుల్వంతు సభామంటపంలో శ్రీసాయిరామ నామామృతం పేరిట భక్తి గీతాల ఆలాపన చేశారు. గంట పాటు సత్యసాయి ప్రేమ తత్వంపై మదురగానాన్ని చేపట్టారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఇది పశువుల పాక కాదండోయ్..!



హెల్త్ క్లినిక్ ఆవరణలో ఉన్న పశువులు

నల్లమాడ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.బండవాండ్లపల్లి సమీపంలో నిర్మించిన హెల్త్ క్లీనిక్ భవనం ఇది. దీన్ని వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ. 21.30 లక్షలతో నిర్మించారు. దీని నిర్మాణం సుమారు మూడేళ్ల క్రితమే పూర్తి అయింది. అయినా ఇంతవరకూ దీన్ని ప్రారంభించలేదు. నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని కొంతమంది గ్రామస్థులు పశువుల పాకగా మర్చారు. ఎండ వేడి అధికంగా ఉండడంతో పశువులను ఈ భవనం ఆవరణంలో ఉంచుతున్నారు. అలాగే వాటికి కావాల్సిన మేతను కూడా నిల్వ ఉంచారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భవనాన్ని ఉపయోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.



మేకల మంద

వైభవంగా ఉచిత సామూహిక వివాహాలు



తాళిబొట్లను అందజేస్తున్న నంజావధూతస్వామి

మడకశిర రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠాపురం కోదండ రాముడి ఆలయంలో సోమవారం ఉచిత సామూహిక వివాహాలు వైభవంగా జరిగాయి. మాజీ మంత్రి రఘువీరారెడ్డి పెద్దనాన్న స్వర్గీయ శ్రీరామిరెడ్డి జ్ఞాపకార్థం 44 ఏళ్లుగా ప్రతిఏడు శ్రీరామనవమి వేడుకల్లో సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు వస్త్రాలు, తాళిబొట్లు, కాలిమెట్టెలను ముఖ్యఅతిథులుగా హాజరైన నంజావధూతస్వామి అందజేశారు. సీతారామ కల్యాణోత్సవ గడియల్లో 18 జంటలు ఒక్కటయ్యాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మాజునాథ్ పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోరంట్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలో చౌకధాన్యపు డీలర్లు రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘం నాయకులు తహసీల్దార్ మారుతికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్ వ్యవస్థలో భాగంగా ఎక్కడైనా సరుకులు తీసుకునే వెసులుబాటు ఉన్నా ఆ డీలర్ పరిధిలోని వారికే రేషన్ ఇస్తున్నారని పేర్కొన్నారు. దీంతో తెల్లవారుజాము నుంచే లబ్ధిదారులు షాపుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు. కొంత మంది డీలర్లు రెండు రోజుల్లోనే తమ వద్ద స్టాకు అయిపోయిందని షాపులను మూసివేస్తున్నారని తెలిపారు. డీలర్లకు సరైన దిశానిర్దేశం చేసి సరుకులను లబ్ధిదారులకు అందేవిధంగా చూడాలని కోరారు. లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, స్వర్ణలత, కొండా వెంకటేష్‌లు, ఆంజనేయులు, నంజుడప్ప తహసీల్దార్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టండి

ఎస్ఐకి ప్రజాసంఘాల నాయకుల వినతి



ఎస్ఐకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సోమందేపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారిందని, చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల ఎస్ఐ రమేష్‌ను కోరారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సోమందేపల్లి మీదుగా పాలసముద్రం, బెంగళూరుకు వెళ్లే కియా అనుబంధ పరిశ్రమల బస్సు సంత జరిగే రోజు రద్దీ ప్రాంతం మీదుగా రాకపోకలు కొనసాగిస్తాయన్నారు. ఆటోలు ద్విచక్ర వాహనాలవల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం మేజర్ పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులును కలిసి సంతలో కొనుగోలుదారులు, దుకాణదారులకు పశువులు ఇబ్బందిగా మారాయని తెలిపారు. వాటిని కట్టడి చేయాలని ఆయనకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రంగప్ప, లక్ష్మీనారాయణ, వెంకటేశ్, కేవీపీఎస్ నాయకులు వెంకటేశ్, గంగరాజు, ఈడినాగరాజు, మాబు, బెస్తకిష్టప్ప పాల్గొన్నారు.

'భూములకు రక్షణ కల్పించండి'



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్నరైతులు

అగళి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తమ భూములకు రక్షణ కల్పించి కొనుగోలు విషయాన్ని విరమించుకోవాలని అగళి మండలం హెచ్‌డిహళ్లి గ్రామ పంచాయతీ ప్రజలు సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బారావుకు విన్నవించారు. అప్పటి సబ్ కలెక్టర్ గాయిత్రి దేవి తమకు భూములు ఇచ్చి పంటలు సాగుచేసుకుని జీవనం కొనసాగించాలని సూచించారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలోనే కొండలు, గుట్టలుగా ఉన్నటువంటి భూములను చదును చేసుకున్నామన్నారు. బోరుబావులు ఏర్పాటుచేసుకుని, తోటలు పెంచుకుని జీవనం సాగిస్తున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ చేతన్‌కుమార్ వారం రోజుల క్రితం హెచ్‌డిహళ్లి గ్రామ పంచాయతీలోని భూములను పరిశీలించారన్నారు. పేదలకు ఇచ్చిన భూములు కొనుగోలుచేసి పరిశ్రమలకు ఇవ్వడం ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భూములు కొనుగోలు విషయాన్ని విరమించుకోవాలని తహసీల్దార్ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. రైతులు శరత్‌బాబు, హనుమంతరాయప్ప, నరసింహరాజు, కర్రియన్న, ప్రసన్నకుమార్, సురేష్, వెంకటేశ్, రాఘవ, రామక్రిష్ణ, దేవరాజ్, జగదీశ్, లలితమ్మ, గీతమ్మ, లక్ష్మమ్మ, రంగమ్మ, సిద్దలక్ష్మమ్మ తదితరులు తహసీల్దార్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

బజరంగదళ్ ఆధ్వర్యంలో నేడు ధర్నా

పావగడ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): హిందూ వ్యతిరేక చట్టాన్ని అమలు చేసిన కర్ణాటక ప్రభుత్వానికి దీటైన సమాధానం చెప్పేందుకు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ధర్నా చేస్తున్నట్లు విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు శనిమహాత్మ సర్కిల్ నుంచి టోల్‌గేట్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. అధికసంఖ్యలో ధర్నాకు తరలిరావాలని నాయకులు కోరారు.

నేడు పీయూసీ ఫలితాల విడుదల

పావగడ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పీయూసీ పరీక్షా ఫలితాలు మంగళవారం మధ్యాహ్నం 1.30గంటలకు వెలువడనున్నట్లు బీఈఓ ఇంద్రాణమ్మ తెలిపారు.

వైభవంగా కోదండ రాముడి రథోత్సవం



రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు

చిలమత్తూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కోదండరాముడి బ్రహ్మరథోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా కోడూరు తోపులో స్వామి వారి రథోత్సవాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మురళీమోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ఆలయంలో సీతారాముల మూలవిరాట్‌లకు విశేష పుష్పాలంకరణ, అభిషేకాలు, అర్చన, హోమాలు చేశారు. రథోత్సవ సేవా కార్యక్రమాన్ని కంబాలపల్లికి చెందిన రామిరెడ్డి కుమారులు రంగారెడ్డి దంపతులు నిర్వహించారు. రథాన్ని మామిడాకులు, అరటి పిలకలు, వివిధ రకాల పుష్పాలతో అందంగా తీర్చిదిద్దారు. బ్రాహ్మణులు హోమాలు, ప్రత్యేక అర్చనలతో రథసంప్రోక్షణ చేశారు. ఆలయంలో ఉన్న స్వామి వారి ఉత్సవమూర్తులను రథం చుట్టూ ప్రదక్షిణలు చేయించిన అనంతరం రథంపైకి తీసుకువచ్చారు. భక్తుల గోవిందనామ స్మరణల మధ్య స్వామి వారి రథం ముందుకు కదిలింది. రథంపై అరటి కాయలు, దవణాన్ని సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

రథోత్సవానికి హాజరైన నాయకులు

బ్రహ్మరథోత్సవ కార్యక్రమానికి హిందూపురం ఎంపీ పార్థసారథి, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరన్న హాజరయ్యారు. ఎంపీలకు స్థానిక సర్పంచ్ మురళీమోహన్, టీడీపీ నాయకులు రంగారెడ్డి, బేకరీ గంగాధర్, సోమశేఖర్, కురుబ చంద్రశేఖర్ స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి వారి రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో హిందూపురం మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్, నాగరాజు, బేవనహళ్లి ఆనంద్, లక్ష్మీనారాయణయాదవ్, చెక్‌పోస్టు నంజుండప్ప, శ్రీదేవి, బాలాజీ పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ మునీర్ అహమ్మద్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు.



రథోత్సవంలో పాల్గొన్న నాయకులు

పరిపాలనా సౌలభ్యం కోసమే నియామకం

ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య



వీరయ్యను అభినందిస్తున్న నాయకులు

హిందూపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పరిపాలనా సౌలభ్యం కోసమే తనను ప్రత్యేకంగా ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శిగా ప్రభుత్వం నియమించిందని ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య అన్నారు. సోమవారం ఆయన హిందూపురానికి వచ్చిన సందర్భంగా అధికారులు, నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.వెయ్యి కోట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక చొరవ చూపుతున్నాడని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు బాలాజీతో సమన్వయం చేసుకుని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మునిసిపల్ చైర్మన్ రమేష్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, కన్వీనర్లు జయప్ప, రంగారెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, నాయకులు నాగరాజు, వెంకటేశ్, అమర్నాథ్ తదితరులు వీరయ్యను కలిసి అభినందించారు.

సబ్సిడీతో ట్రాక్టర్ పనిముట్ల అందజేత

ప్రభుత్వం సబ్సిడీతో అందజేసే ట్రాక్టర్ మడకలు సోమవారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద అందజేశారు. ట్రాక్టర్ మడకలను రైతులకు అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏడీ అల్తాఫ్ అలీఖాన్ మాట్లాడుతూ రైతులకు ఆధునిక వ్యవసాయ పనిముట్లు సబ్సిడీతో అందిస్తున్నారని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకొంట అంజినప్ప, ఎమ్మెల్యే పీఏ వీరయ్య పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతుల మహోత్సవం

సోమందేపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగేపల్లి గ్రామంలో సోమవారం ఆంజనేయస్వామి దేవాలయం వద్ద జ్యోతుల మహోత్సవాన్ని నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు కార్యక్రమంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని జ్యోతులను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహులు, మాజీ జడ్పీటీసీ వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు



సోమందేపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లి సజ్జగంట రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ ధర్మకర్త లక్ష్మీకాంత్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆలయాన్ని 1122వ శతాబ్దంలో ఓయశలల వంశస్థుడైన విష్ణువర్ధనుడు నిర్మించడం జరిగిందన్నారు. ఎంతో ప్రాచీనమైన ఈ ఆలయాన్ని రెండవ తిరుపతిగా పిలుస్తుంటారన్నారు. ఈనెల 17వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

కథల రూపంలో పాఠాలు

ఉపాధ్యాయురాలికి ప్రశంస



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ గుడ్డంపల్లి ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయురాలు రంగమ్మ పిల్లలకు కథల రూపంలో పాఠాలు నేర్పుతోంది. దీంతో వారు సులువుగా వాటిని అర్థం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉపాధ్యాయురాలు రంగమ్మను ఎంఈఓ గంగప్ప సన్మానించారు. విద్యార్థులు పాఠాలను సులువుగా నేర్చుకునేలా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 ప్రసన్న లక్ష్మీ పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి: ఎమ్మెల్యే

పావగడ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): విద్యతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ అన్నారు. సోమవారం పీ హసహళ్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడ రాణించాలన్నా అది విద్యతోనే సాధ్యమన్నారు. సభలో ఎస్‌టిఎంసి అధ్యక్షులు చింతలరెడ్డి, మల్లికార్జున, తిమ్మారెడ్డి, బలరాంరెడ్డి, మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హిందూపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. హిందూపురం మండలంలోని కొటిపి వద్ద సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా పూలకుంటకు చెందిన మారుతి, ప్రభు ద్విచక్రవాహనంలో మద్యాన్ని తీసుకొస్తున్నారు. అయితే ఎక్సైజ్ పోలీసులను చూసి వాహనం వదిలేసి వెళ్లిపోయారన్నారు. కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా శివారెడ్డి అనే వ్యక్తిని అరెస్ట్‌చేసి అతడి నుంచి కేసు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఏపీఓగా శివన్న

గుడిబండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓగా శివన్న సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఓ భార్గవి ధర్మవరానికి బదిలీ అయ్యారు. దీంతో అగళిలో పనిచేస్తున్న శివన్నను ఏపీఓగా వచ్చారు. ఎంపీడీఓ గంగాధర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా ఈసీగా జగదీశ్ బాధ్యతలు చేపట్టారు.

విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ప్రారంభం



వేదపారాయణం చేస్తున్న అర్చకులు

గోరంట్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బూడిదగడ్డపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీపట్టాభి రామచంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రవాస భారతీయుడు కోట్లో శేషాద్రి రెడ్డి, వనజ దంపతుల ఆధ్వర్యంలో రామాలయం నిర్మించారు. పురోహితులు శేఖర్‌స్వామి ఆధ్వర్యంలో వేదపండితులు సోమవారం దీక్ష హోమ, విగ్రహాల జలధి వాసం నిర్వహించారు. మంగళవారం బ్రహ్మ మూహూర్తంలో శ్రీపట్టాభి రామచంద్రస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, గోపుర కలశ స్థాపన, పూజా కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించనున్నారు. సాయంత్రం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని జరపనున్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోట్లో ఓబులమ్మ, శేషాద్రిరెడ్డి కుటుంబ సభ్యులు కోరారు.



విద్యుత్ దీపాలంకరణలో స్వామివారి ఆలయం

ఘనంగా గుండుమల తిప్పేస్వామి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

గుడిబండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకల సందర్భంగా కేక్‌కట్‌చేసి స్వీట్లను పంచుకొన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, నాయకులు శివకుమార్, దుర్గేష్, లక్ష్మీనరసప్ప, ప్రకాష్, బాలేపల్లి రాజు, భీమరాజు, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల మారమ్మకు జలధి ఉత్సవం



గుడిబండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో తుమ్మలమారమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సోమవారం అమ్మవారికి జలధి ఉత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వంకలోకి తీసుకెళ్లి గంగా పూజ చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



చిలమత్తూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట్లోపల్లి గ్రామంలో నూతన రామాలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం ఆలయ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఉదయం 4 గంటల నుంచే ఆలయ ఆవరణలో మహా గణపతి పూజ నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా ధ్వజస్తంభం ఏర్పాటుచేశారు. అనంతరం గ్రామస్థులు రామనామ జపం చేశారు.

'ర్యాలీని జయప్రదం చేయండి'



ర్యాలీ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న ర్యాలీని జయప్రదం చేయాలని దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను అంబేడ్కర్ భవవన్ వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ర్యాలీకిపెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో లైఫ్‌వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ ఉదయ్‌కుమార్, రామ్మూర్తి, ఆనంద్, రామకృష్ణ, శ్రీరాములు, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్లు రవికుమార్, నాగరాజు పాల్గొన్నారు.

ఇంటి పట్టాల కోసం ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

పెనుకొండ, ఏప్రిల్ 7(ఆంధ్ర జ్యోతి): శ్రీకృష్ణదేవరాయల కాలనీలో ఇల్లు కట్టుకుని నివసిస్తున్న పేదలకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. సోమవారం సీపీఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో దండోర నాయకులు, కాలనీవాసులు తహసీల్దార్ శ్రీధర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్వే నంబరు 272లో కొంతకాలంగా పేదలు నివసిస్తున్నారని వారే సొంత ఖర్చులతో బోరువేయించుకుని నీళ్లట్యాంకు నిర్మించుకున్నారన్నారు. వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో దండోర నాయకులు రామాంజినేయులు, సీపీఐ నాయకులు నరసింహ, వెంకటేశులు, మల్లికార్జున పాల్గొన్నారు.

ఓఆర్‌ఎస్ కేంద్రం ఏర్పాటు

సోమందేపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌డే సందర్భంగా వినతులు ఇచ్చేందుకు వచ్చే వారికి వడదెబ్బ తగలకుండా ఓఆర్‌ఎస్ కేంద్రాన్ని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ప్రతి సోమవారం కేంద్రాన్ని కొనసాగిస్తామని వైద్యులు ఓంకార్ తెలిపారు.